క్లుప్తంగా

ఆలోచించి ఓటు వేయాలి



గుడివాడ టౌన్: ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే టప్పుడు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని మెప్మా పీడీ పి.వెంకటనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరంలో మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా సీఓలు, ఆర్పీలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అనంతరం పట్టణ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, డీటీ బి.లోకరాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్. హరి, సీఎంఎం జీఏ సుజాత పాల్గొన్నారు.

రేణుకా పరమేశ్వరుడికి అన్నాభిషేకం



పామర్రు: అంకమ్మతల్లి ఆలయంలోని రేణుకా పరమేశ్వరుడికి మంగళవారం అన్నాభిషేకం నిర్వహించారు. మాఘమాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని విశేష కార్యక్రమాలను చేశారు. భక్తుల సహకారంతో ఈ అన్నాభిషేకం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ వరదా అప్పారావు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, ఎం.పేరయ్య, రమేష్, దుర్గాప్రసాద్, చెన్నారాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణపై కళాజాత



కురుమద్దాలి(పామర్రు): జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా ఎయిడ్స్ నివారణపై మంగళవారం మండలంలోని కురుమద్దాలి గ్రామంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంతేకాకుండా రక్తదానం చేయాల్సిన అవసరం, దాని వల్ల కలిగే లాభాలు, టీబీ, క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కళాకారులు నాటికల ద్వారా ప్రదర్శించారు. టీమ్ లీడర్ ఎం.శేఖర్ బాబు ఆధ్వర్యంలో బృంద సభ్యులు వై వీరయ్య, రవితేజ, చిరంజీవి పాల్గొన్నారు.

24న సామూహిక వ్రతాలు



గుడివాడ టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 24న సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ గుడివాడ కార్యదర్శి కావూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం స్థానిక కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్లో వ్రతాల బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో శనివారం ఉదయం 9.30 గంటలకు ఈ సామూహిక వ్రతాలు ప్రారంభమవుతాయన్నారు. వ్రతానికి సంబంధించిన పూజా సామగ్రి ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల భక్తులు పూర్తి వివరాలకు 77806 80169ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ జవ్వాజి గంగరాజు, పరిశె వాణిశ్రీ పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయస్థానం



కైకలూరు: కృష్ణా యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ పురుషుల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 19న విజయవాడ నలంద డిగ్రీ కాలేజీలో జరిగాయి. ఈ పోటీల్లో కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ద్వితీయ స్థానం సాధించింది. జట్టులో పి.కార్తీక్(తృతీయ బీఏ), సీహెచ్ పవన్‌కుమార్, ఎం.సంపత్ (ద్వితీయ బీఏ) విద్యార్థులు యూనివర్సిటీ జట్టులో స్థానం సంపాదించుకున్నారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఉదయప్రకాష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జాలబాబు, హిస్టరీ డిపార్టుమెంట్ హెడ్ ఎం.హరిప్రసాద్, కామర్స్ హెడ్ నున్న శ్రీనివాస్, పీడీ మన్నె శివనాగరాజు అభినందించారు.

మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

పెదమద్దాలి(పామర్రు): పెదమద్దాలి పంచాయతీకి చెందిన గేరక యేసు ప్రమాదవశాత్తు ఈ మధ్య మృతి చెందారు. ఈ నేపథ్యంలో మంగళవారం మనం ఫౌండేషన్ డైరెక్టర్ పెనుమాల శ్రీనివాసరావు(పీఎస్ఆర్) స్పందించి మృతుడి కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ తరఫున రూ.5 వేల సాయాన్ని అందజేశారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా వలంటీర్ల సేవలు

ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడరూరల్: ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తూ సేవలు అందిస్తున్న వలంటీర్లు అభినందనీయులని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పేర్కొన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా గుడివాడ పట్టణ, మండలాల్లో సేవలందించిన వలంటీర్లకు మంగళవారం గుడివాడ మార్కెట్‌యార్డ్‌లో నిర్వహించిన సత్కార కార్యక్రమంలో ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణ పరిధిలోని 510 మంది, మండల పరిధిలోని 238 మంది వార్డు, గ్రామ వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాలతోపాటు వరుసగా రూ.15వేలు, రూ.30వేలు, రూ.40వేలు చొప్పున అందజేశారు. సాంకేతిక కారణాలతో పురస్కారాలకు అర్హత కోల్పోయిన 38 మంది వలంటీర్లకు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున రూ.5.70 లక్షలు ఎమ్మెల్యే కొడాలి నాని సొంత నిధులు అందజేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలపై మమకారంతో స్వచ్ఛందంగా గౌరవ వేతనంతో పని చేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా వలంటీర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఎటువంటి వివక్ష చూపకుండా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తోందన్నారు. కుటుంబ సభ్యుల మాదిరిగా సేవలందిస్తున్న వలంటీర్ల పేరు చెబితే చంద్రబాబు ఉలిక్కి పడుతున్నారన్నారు. వానర సైన్యాన్ని చూసి లంకాధిపతి రావణుడు ఎలా వణికి పోయాడో.. రాజకీయ రావణాసురుడు చంద్రబాబు అండ్ కో బ్యాచ్ వలంటీర్లను చూస్తే అలా వణికిపోతున్నారన్నారు. ప్రజలకు అన్యాయం చేసే రాజకీయ రావణాసురుడిని వానర సైన్యం మాదిరిగా వలంటీర్లు తరిమికొట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు మంచి జరుగుతుందో వలంటీర్లు ప్రజలకు వివరించాలని సూచించారు. అతి త్వరలోనే వలంటీర్లతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తానని ఎమ్మెల్యే నాని తెలిపారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ మట్టా నాగమణివిక్టర్, ఎంపీపీ గద్దే పుష్పరాణి, జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు మట్టా జాన్‌విక్టర్, గొర్ల శ్రీను, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ జ్యోతి, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ భాస్కరరావు, వైస్ ఎంపీపీ నాగమల్లేశ్వరి, నాయకులు నీలాకాంత్, నరసింహారావు, సయ్యద్, ఆలీబేగ్, ఆర్‌కె, అప్పారావు, శేఖర్, సైమన్, డాక్టర్ మలిరెడ్డి రవి పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని, ప్రజాప్రతినిధులు, అధికారులు

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



కైకలూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



కైకలూరులో ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన సేవలను గుర్తించి మరో పర్యాయం ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జరుగుతున్న ప్రజా ఆశీర్వాద యాత్ర రెండో రోజు కైకలూరులో మంగళవారం జరిగింది. గ్రామ 1వ వార్డు కొత్తపేట వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడ నుంచి 1, 2, 3 వార్డులతో పాటు దానిగూడెం, వైఎస్సార్ నగర్‌లో సాగింది. ఆద్యంతం ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే డీఎన్నార్ నివాళులర్పించారు. ఓపెన్ టాప్ వాహనంపై ప్రజలకు అభివాదం చేశారు. దానిగూడెం, వైఎస్సార్ నగర్‌లలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ కుటుంబాల్లో బ్యాంకు పాస్ పుస్తకాలలో ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత జమ చేసిన నగదును ఒక్కసారి పరిశీలించాలని చెప్పారు. దళారి వ్యవస్థకు తావులేకుండా సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయన్నారు. దానిగూడెం ఎస్సీవాడలో రూ.కోటి 60 లక్షలతో సీసీ రోడ్డును ఏర్పాటు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ అడివి కృష్ణ, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీరరాజు, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, నాయకులు ముంగర నరసింహారావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భత్రాజు శివాజీ, రాష్ట్ర, జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్ హమీద్, షేక్ రఫీ, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ జగనన్న ప్రభుత్వ లక్ష్యం



మంటాడలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న లక్ష్మి, రాంబాబు తదితరులు



భద్రిరాజుపాలెంలో మహిళకు మందులను అందజేస్తున్న సర్పంచ్ హేమలత

పమిడిముక్కల: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎంపీటీసీ సభ్యురాలు మేరుగ లక్ష్మి పేర్కొన్నారు. మంటాడ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. వైద్యులు బాలాజీ మాట్లాడుతూ వైద్య శిబిరంలో 91 రకాల మందులను అందిస్తున్నట్లు తెలిపారు. ఈఓఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నందమూడి వీరమ్మ, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు పాల్గొన్నారు

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

తోట్లవల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని భద్రిరాజుపాలెం సర్పంచ్ కొక్కిలిగడ్డ హేమలత అన్నారు. మండలంలోని భద్రిరాజుపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 వైద్య శిబిరం మంగళవారం జరిగింది. తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మాధవి, డాక్టర్ భార్గవి ఆధ్వర్యంలో 235 మందికి ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. ఉప సర్పంచ్ చాగంటి తిరుమలరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు చాగంటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక వెసులుబాటు

మండవల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఎంతో ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని ఈఓపీఆర్డీ బి ఆనందబాబు, సర్పంచ్ నాగదాసి థామస్ అన్నారు. కానుకొల్లులో రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.అనీల, ఏలూరు వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు వెబ్‌నార్

గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన లింక్డ్‌ఇన్ ఇండియా కార్పొరేషన్ ఆధ్వర్యంలో వెబ్‌నార్(సెమినార్) నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు మాట్లాడుతూ లింక్డ్‌ఇన్ ఇండియా సంస్థ విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఆన్‌లైన్ విధానంలో ఇస్తుందన్నారు. దీని ద్వారా విద్యార్థులు పైథాన్, జావా తదితర కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవచ్చన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ ఏజీ శ్రీనాథ్, మధుమతి, అరుణ్‌కుమార్, అకాడమీ డైరెక్టర్ బి కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబవుతున్న భోగేశ్వరుడు

కలిదిండి: పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవ ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సీహెచ్ రంగారావు కలిదిండి భోగేశ్వరస్వామిని దర్శించి, ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భక్తులు స్నానాలు ఆచరించడానికి కోనేరులో నీటిని నింపడం, చలువ పందిర్లు ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. మార్చి 6 నుంచి 10వ తేదీ వరకు మహాశివరాత్రి తీర్థం కొనసాగుతుందన్నారు.

నేడు జాతరపై సన్నాహక సమావేశం

కైకలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర(తీర్థం) మార్చి 11 నుంచి 24వ తేదీ వరకు జరగనుంది. జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గాగోకర్ణేశ్వరస్వామి కల్యాణం మార్చి 21న నిర్వహించనున్నారు. జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఏలూరు ఆర్డీఓ ఎన్‌ఎస్‌కే.ఖాజావలి వ్యవహరిస్తున్నారు. జాతర సన్నాహక సమావేశం బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు కొల్లేటికోట దేవస్థానం వద్ద జరుగుతోందని ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు మంగళవారం తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, రాష్ట్ర వడ్డీలు డెవలప్‌మెంటు కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పుట్టలో పాలు పోశారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రేపు ఉరుసు మహోత్సవం



పామర్రు: స్థానిక హజరత్ జియావుల్ హఖ్‌లీమ అల్లా మొహిబుల్లా షా చిష్టి బాబా 80వ ఉరుసు మహోత్సవం ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎండీ ఆసీఫ్‌ఖాన్, ఎండీ ఆఫ్‌ద్ అలీ ఖాన్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ ఉరుసు మహోత్సవంలో రాష్ట్రం నలుమూలల నుంచి అనేక మంది భక్తులు హాజరవుతారని పేర్కొన్నారు. వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఉరుసు మహోత్సవం పురస్కరించుకుని ఆ రోజు సాయంత్రం చందనం ఊరేగింపు అనంతరం దర్గాలో ప్రత్యేక పూజలు, ఖవాలీ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. వచ్చిన భక్తులందరికీ అన్న సమారాధన ఉంటుందని తెలిపారు.

బీమా యోజనతో ఆర్థిక భరోసా

మండవల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రతా పథకాలైన పీఎం జీవన జ్యోతి బీమాయోజన, సురక్ష బీమా యోజన పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. మండవల్లికి చెందిన యార్లగడ్డ ఎస్తేరురాణి రెండు నెలల క్రితం పీఎం జేజేవై పథకంలో చేరి గుండెపోటుతో మరణించింది. నామినీకి రూ. 2 లక్షల చెక్కును మంగళవారం అందజేశారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఐక్య వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో సామాజిక భద్రతా పథకాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో దుర్గారావు, ఎల్ఎస్ భాస్కరరావు, టి అప్పారావు మాట్లాడుతూ పీఎం జేజేబీవై పథకం వార్షిక ప్రీమియం కేవలం రూ.436 మాత్రమేనన్నారు. 18 నుంచి 50 ఏళ్లలోపు వారు ఈ పథకంలో చేరడానికి అర్హులని పేర్కొన్నారు.

రేపు రామలింగేశ్వరుని శాంతి కల్యాణం

కైకలూరు: స్థానిక రామేశ్వర, రామలింగేశ్వర స్వామివార్లకు ఈ నెల 22న సాయంత్రం 6.30 గంటలకు శాంతి కల్యాణం జరుగుతుందని ఆలయ ఈఓ వీఎస్‌కే.శేఖర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 21, 22, 23 వరకు త్రయాహ్నిక దీక్షతో కార్యక్రమాలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రముఖ న్యాయవాదులు గొర్తి ప్రభాకరదీక్షితులు, గురజాడ ఉదయశంకర్ దంపతులు కల్యాణ క్రతువును చేస్తారన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

వాహనదారులకు అవగాహన

ముదినేపల్లి రూరల్: ద్విచక్ర వాహనాలను హద్దు మీరిన వేగంతో నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై డి.వెంకటకుమార్ హెచ్చరించారు. ముదినేపల్లి శివారులో వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

నేటి నుంచి ప్రజాపోరు యాత్ర-2

గుడివాడ టౌన్: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రజాపోరు యాత్ర–2 ప్రారంభమవుతున్నట్లు ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ సూరే లక్ష్మీ నారాయణ (గాంధి) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరిస్తూ ఈ నెలాఖరవరకు ఈ యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి

పామర్రు: ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో ఏఎన్ఎం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కబర్చి విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎన్ఎం హైస్కూల్లో విజేతలను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన మచిలీపట్నంలోని పోలీస్ ఫంక్షన్ ప్లాజాలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. అండర్-12 , అండర్-14 బాలురు, బాలికల విభాగాలలో డీ భవన శ్రీజ, కె స్ఫూర్తి, పీ శ్రావ్యశ్రీ ప్రథమ స్థానంలో గెలుపొంది బంగారు ట్రోఫీని ప్రశంసా పత్రాన్ని సాధించారన్నారు. ద్వితీయ స్థానంలో ముగ్గురు విజేతలై వెండి ట్రోఫీ, ప్రశంసా పత్రాన్ని పొందారు. కోచ్ వీవీ ఎస్ రామకృష్ణను ప్రిన్సిపాల్ అభినందించారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



అయ్యంకిలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

అయ్యంకి(మొవ్వ): గడిచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్ర రాజకీయాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అధిక ప్రాధాన్యమిస్తూ బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేసిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మొవ్వ మండలం అయ్యంకి గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. అధికారులు, వలంటీర్లు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కోట్ల మంది అర్హులైన లబ్ధిదారులకు నేరుగా బ్యాంకు ఖాతాలకు సంక్షేమ ఫలాలను అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అవినీతి రహితంగా పాలన సాగిస్తూ, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వలంటీర్లతో జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు మాత్రం నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, సర్పంచ్ నాగనబోయిన సునీల్, ఎంపీటీసీ సభ్యురాలు కాశీ విశ్వేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, మండల యూత్ కన్వీనర్ కొలుసు నరసింహయాదవ్, నాయకులు మురళీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుడివాడ ప్రజల గుండెల్లో కొడాలి నాని



మాట్లాడుతున్న ఎంవీ నారాయణరెడ్డి

గుడివాడ టౌన్: ప్రతిపక్షాలు, ఎల్లో మీడియాకి సంబంధించిన సోషల్ మీడియా గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నానీ)పై ఎంత దుష్ప్రచారం చేస్తే అంతగా నియోజకవర్గ ప్రజల గుండెల్లో ఆయన స్థానం సంపాదించుకుంటారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన వ్యక్తిగత కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజులుగా కొడాలి నానికి గుడివాడలో టికెట్ లేదంటూ ఓటమి భయంతో పారిపోయాడంటూ ప్రచారం చేయడాన్ని నారాయణరెడ్డి తిప్పికొట్టారు. 20 సంవత్సరాలుగా ప్రజల మధ్య ఉంటున్న కొడాలి నానీపై వ్యక్తిగతంగా ప్రజల్లో వ్యతిరేకత లేదన్నారు. ప్రతి పేదవాడు ఆయన వద్దకు వస్తే వారికి కావాల్సిన సాయం చేశారే తప్ప వట్టి చేతుల్తో వెనక్కి పంపలేదన్నారు. గుడుల నిర్మాణం, పుణ్యకార్యాలు, ఆరోగ్య సమస్యలు, ఇతర సమస్యలు అంటూ ఆయన వద్దకు అనేక మంది వస్తుంటారని వారికి సాయం చేసి వారి ప్రేమాభిమానాలను పొందే నాయకుడు కొడాలి నాని అని తెలిపారు. ఇప్పటికే ప్రతిపక్షాలకు దమ్ముంటే తనపై చంద్రబాబునాయుడు పోటీ చేయాలని కొడాలి నానీ చాలెంజ్ విసురుతున్నా దానికి స్పందించే నాయకులు లేకపోవడం నానీ గొప్పదనానికి నిదర్శనమన్నారు. కనుక ప్రతిపక్ష నాయకులు, ఎల్లో మీడియా ఎంత తప్పుడు ప్రచారం చేసినా ప్రజలు నమ్మబోరని తెలిపారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

ఎంపీపీ అశోక్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అశోక్‌కుమార్

పామర్రు: అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయ పర్చుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి దృష్ట్యా గ్రామాలలో ఎక్కడా కూడా తాగునీటి ఎద్దడికి గురి కాకుండా తగు విధమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ ట్యాంక్‌లను ఎప్పటి కప్పుడు శుభ్రం చేయించాలన్నారు. ఎంపీడీఓ భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, పీ రత్నకుమారి, మహేష్, సర్పంచ్‌లు జీ విజయ భారతి, దిరిశం రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, పురుషులకు సమాన హక్కులు

సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి



అవగాహన సభలో మాట్లాడుతున్న జడ్జి లక్ష్మి

కైకలూరు: సమాజంలో స్త్రీ, పురుషులకు భేదాలు లేకుండా సమాన హక్కులు పొందాలని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి సూచించారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా ఆటపాక ఎస్ఎంఎల్‌పీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల్లో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం జరిగింది. సదస్సులో జడ్జి మాట్లాడుతూ పురుషులతో పాటు స్త్రీలకు చట్టపరంగా సమాన హక్కులు ఉంటాయన్నారు. విద్యార్థి దశ నుంచి బాలికలు హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. న్యాయస్థానాలు మహిళల హక్కుల రక్షణకు అనేక చట్టాలను పొందుపర్చారన్నారు. మహిళల హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించవచ్చని తెలిపారు. హెచ్ఎం అన్నపూర్ణ బాలికల హక్కులపై ప్రసంగించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, ఉపాధ్యాయులు ఎన్ వీఎల్ఎస్.అనసూయ, వి.మేరీరత్నం, కానిస్టేబుళ్లు ఏ.నరసింహామూర్తి, పీఎస్.శ్రీనివాసరావు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ నిర్వాహకురాలు ఏ.దుర్గాభవానీ, పారా లీగల్ వలంటీర్లు సీహెచ్ వేణుబాబు, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.